ప్రజల సమస్యలే మా ప్రాధాన్యం
సత్యం.. సమాజం.. సమగ్ర అభివృద్ధి..
# సందేశ సేతు
మన ప్రాంతం మన గళం
ప్రజల నుండి... ప్రజల కోసం...
SANDESHA SETHU | TELUGU DAILY
సమాచారమే సమాజానికి సేతు
సంపుటి : 01 / సంచిక : 03 / ఎడిటర్ : రాచర్ల గోపి / వరంగల్, తెలంగాణ పేజీలు : 8 / వెల రూ : 4/-

# ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం వద్దు...

- రాజధాని పనులపై చంద్రబాబు సమీక్ష.. కీలక ఆదేశాలు
- నెలకు రూ.2 వేల కోట్ల విలువైన పనులు పూర్తి చేయాలని లక్ష్యం
- గత నెలలో రూ.1,345 కోట్ల పనులు జరిగాయని అధికారులు వెల్లడి
- ఔటర్ రింగ్ రోడ్డుపై దృష్టి సారించాలని అధికారులకు ఆదేశం
- ప్రస్తుతం 41 వేల మంది కార్మికులతో కొనసాగుతున్న పనులు



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. రాజధాని ప్రాంతంలో ప్రతి నెలా కనీసం రూ. 2 వేల కోట్ల విలువైన పనులను పూర్తి చేయాలని ఆయన అధికారులకు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో పురపాలక శాఖ మంత్రి పి. నారాయణతో పాటు వివిధ నిర్మాణ సంస్థల ప్రతినిధులతో సీఎం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. గత నెలలో రాజధాని పరిధిలో రూ. 1,345 కోట్ల విలువైన పనులు పూర్తయినట్లు అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి నివేదించారు. నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా చేరుకోవాలంటే పనుల వేగాన్ని మరింత పెంచాలని చంద్రబాబు సూచించారు. ప్రస్తుతం అమరావతిలో 152 ప్రాజెక్టులకు సంబంధించి సుమారు 41 వేల మంది కార్మికులు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని మంత్రి నారాయణ వివరించారు. వివిధ నిర్మాణ సంస్థలు చేపట్టిన పనుల పురోగతిని సీఎం స్వయంగా ఆరా తీశారు. రాజధాని అభివృద్ధిలో కీలకమైన ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ప్రాజెక్టు పనులను త్వరితగతిన పట్టాలెక్కించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం చోటుచేసుకోకూడదని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు.సభలో చంద్రబాబు మాట్లాడుతూ, "ప్రజల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ఈ రోజు ప్రొద్దుటూరులో ఈ బృహత్కార్యక్రమాన్ని ప్రారంభించాం. తెలుగు జాతి కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు గారి స్ఫూర్తితో ఈ పథకానికి 'అమరజీవి జలధార' అని పేరు పెట్టాం. రాష్ట్రానికి అన్యాయం చేసిందని ఆయన ఆరోపించారు.

## సిద్దిపేట పదేళ్ల పండుగకు ఘన సన్నాహాలు

- జిల్లా ఖ్యాతి దేశవ్యాప్తంగా చాటేలా వేడుకలు
- మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించాలని నిర్ణయం
- అన్ని వర్గాల భాగస్వామ్యంతో వేడుకలకు రూపకల్పన
- మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు

**సిద్దిపేట, అక్టోబర్ 06 సందేశ సేతు**



సిద్దిపేట జిల్లా ఆవిర్భావానికి పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు పిలుపునిచ్చారు. సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో కవులు, కళాకారులు, జర్నలిస్టులు, వైద్యులు, న్యాయవాదులు, వ్యాపారులు, విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులు, ప్రజాసంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లా ఖ్యాతి, కీర్తి ఎల్లలు దాటేలా పదేళ్ల పండుగను నిర్వహించాలని సూచించారు. సిద్దిపేట జిల్లా కోసం దశాబ్దాల పాటు సాగిన ఉద్యమం, ఆకాంక్షలను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలని హరీశ్ రావు అన్నారు. 1983 నుంచే సిద్దిపేట జిల్లా డిమాండ్ ప్రజల్లో బలంగా ఉన్నప్పటికీ అది చాలా కాలం నినాదంగానే మిగిలిపోయిందని పేర్కొన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ 2016 అక్టోబర్ 11న సిద్దిపేట జిల్లాను ఏర్పాటు చేసి చరిత్రలో సువర్ణ అధ్యాయాన్ని లిఖించారని అన్నారు. జిల్లా ఏర్పాటు ద్వారా ప్రజలకు పరిపాలన మరింత చేరువైందని పేర్కొన్నారు. జిల్లా ఏర్పాటుకు ముందు ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, జర్నలిస్టులు, వ్యాపారులు, విద్యార్థులు వివిధ అవసరాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని గుర్తు చేశారు. జిల్లా ఏర్పడిన తర్వాత పరిపాలనా సౌకర్యాలు విస్తరించడంతో పాటు అభివృద్ధి వేగవంతమైందని చెప్పారు. జిల్లా ఏర్పాటుతో వచ్చిన మార్పులను యువతకు పరిచయం చేయడం అవసరమని పేర్కొన్నారు.

## ఆసుపత్రుల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

- సిబ్బంది నియామకాలకు ముందస్తు చర్యలు
- ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులపై పర్యవేక్షణ
- గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై సమీక్ష
- సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, అక్టోబర్ 06 సందేశ సేతు**

రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ప్రధాన వైద్య సంస్థల పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉస్మానియా ఆసుపత్రి, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, ఎల్బీ నగర్ టిమ్స్, అల్వాల్ టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణ పురోగతిపై జూబ్లీహిల్స్ నివాసంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి వివరాలు తెలుసుకున్నారు. నిర్మాణ పనులు పూర్తయ్యే సమయానికి వైద్యులు, ఇతర సిబ్బంది కొరత లేకుండా నియామక ప్రక్రియను ముందుగానే ప్రారంభించాలని సూచించారు. ఆసుపత్రుల నిర్మాణం పూర్తయ్యే నాటికి అవసరమైన అత్యాధునిక వైద్య పరికరాలను సమకూర్చి అన్ని రకాల వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, ప్రభుత్వ ఆసుపత్రులను విధిగా సందర్శించి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతి వారం సమీక్ష నిర్వహించి పురోగతిని పరిశీలించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తిని దృష్టిలో ఉంచుకొని ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. అవసరమైన చోట పాఠశాలల్లో మరమ్మతు పనులు చేపట్టి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని తెలిపారు. విద్య, వైద్యం రంగాల్లో క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు.

## ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్ పోటీలకు ఆహ్వానం

**పోలీసుల సేవలను ప్రతిబింబించేలా ఎంట్రీలు ఉండాలి**

**ఈ నెల 22 వరకు దరఖాస్తులకు అవకాశం**

**జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్**



**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 06 ( సందేశ సేతు ) :**

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం, పోలీస్ ఫ్లాగ్ డేను పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ తెలిపారు. జిల్లాలోని ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లు, షార్ట్ ఫిల్మ్ మేకర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పోలీసుల విధి నిర్వహణ, ప్రజలకు అందిస్తున్న సేవలను ప్రతిబింబించే అంశాలపై 2025 అక్టోబర్ నుంచి 2026 అక్టోబర్ వరకు తీసిన ఫోటోలు, షార్ట్ ఫిల్మ్‌లను పోటీలకు పంపించవచ్చని తెలిపారు. ఒక్కొక్కరు మూడు ఫోటోలు సమర్పించవచ్చని, షార్ట్ ఫిల్మ్ నిడివి మూడు నిమిషాలకు మించకూడదని స్పష్టం చేశారు. జిల్లా నుంచి ఉత్తమ ఎంట్రీలు రాష్ట్రస్థాయికి జిల్లా స్థాయిలో అందిన ఎంట్రీలను పరిశీలించి ఉత్తమమైన మూడు షార్ట్ ఫిల్మ్‌లు, మూడు ఫోటోలను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని ఎస్పీ తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన వారికి మెరిట్ సర్టిఫికెట్లు అందజేస్తారని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా పోలీస్ శాఖ నిర్వహించే కార్యక్రమాలు, పోలీసుల సేవలు, విధి నిర్వహణ, ప్రజల రక్షణలో వారి పాత్రను ప్రతిబింబించే మంచి ఫోటోలు, షార్ట్ ఫిల్మ్‌లను పోటీలకు పంపించాలని సూచించారు. పోటీదారులు 10 ఐ 8 అంగుళాల పరిమాణంలో మూడు ఫోటోల హార్డ్ కాపీలతో పాటు ఫోటోలు, షార్ట్ ఫిల్మ్ సాఫ్ట్ కాపీలను పెన్‌డ్రైవ్‌లో పొందుపరిచి ఈ నెల 22వ తేదీలోపు సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలోని పోలీస్ పీఆర్వో సెక్షన్‌లో అందజేయాలని ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. మరిన్ని వివరాలకు పోలీస్ పీఆర్వోను 8712539040 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## భద్రకాళి శరన్నవరాత్రులకు పటిష్ట భద్రత

**ముందస్తు ఏర్పాట్లను పరిశీలించిన వరంగల్ సీపీ ఎన్. శ్వేత, ఐపీఎస్**

**క్యూలైన్లు, పార్కింగ్ ప్రాంతాలు, ఆలయ పరిసరాల క్షేత్రస్థాయి తనిఖీ**

**భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచన**



**వరంగల్, అక్టోబర్ 6 ( సందేశ సేతు ) :**

వరంగల్ నగరంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ భద్రకాళి దేవస్థానంలో ఈ నెల 11వ తేదీ నుంచి ప్రారంభం కానున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చేపడుతున్న ముందస్తు భద్రతా ఏర్పాట్లను వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శరన్నవరాత్రి ఉత్సవాలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చేపడుతున్న ఏర్పాట్లపై పోలీసు అధికారులను సీపీ అడిగి తెలుసుకున్నారు. ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఆలయ పరిసరాలను పరిశీలించిన సీపీ.. భక్తుల రాకపోకలకు ఏర్పాటు చేస్తున్న క్యూలైన్లు, పార్కింగ్ ప్రదేశాలు, ప్రవేశ--నిష్క్రమణ మార్గాలు, ఇతర భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వాహనాల పార్కింగ్, రాకపోకల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పోలీసు శాఖ, ఆలయ పాలక మండలి పరస్పర సమన్వయంతో పనిచేసి భక్తులకు సురక్షితమైన దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేయాలని సీపీ పేర్కొన్నారు. ఈ పరిశీలనలో సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, అడిషనల్ డీసీపీ (అడ్మినిస్ట్రేషన్) రాయల ప్రభాకర్‌రావు, హనుమకొండ ఏసీపీ నర్సింహారావు, ట్రాఫిక్ ఏసీపీ టి. సత్యనారాయణ, మట్టెవాడ, ఇంతేజార్‌గంజ్, మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఆలయ పాలక మండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

# పగటిపూట కోతలు -రాత్రిపూట లో-వోల్టేజ్





**రైతన్న బతుకులు ఆగమాగం**

**విద్యుత్ కోతలను నిరసిస్తూ రైతుల మహాధర్నా**

**పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం**

**పట్టించుకోవడం లేదని ఆగ్రహం**

**నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరా**

**చేయాలని డిమాండ్**

**లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తాం:**

**మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్**

**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 06 ( సందేశ సేతు ) :**

పుల్కల్ మండలంలో విద్యుత్ కోతలు, లో-వోల్టేజ్ సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. పగటిపూట విద్యుత్ కోతలు, రాత్రిపూట లో-వోల్టేజ్‌తో వ్యవసాయ మోటార్లు పనిచేయక పంటలు ఎండిపోతున్నాయని ఆరోపిస్తూ ఆయన ఆధ్వర్యంలో సోమవారం పుల్కల్ మండల కేంద్రంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రైతులు మహాధర్నా నిర్వహించారు. పుల్కల్ మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు తరలివచ్చి విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. సాగునీరు అందక వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను కరెంట్ కష్టాల్లోకి నెట్టారు: క్రాంతి కిరణ్ ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు విద్యుత్ కష్టాలు మొదలయ్యాయని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించామని, ప్రస్తుతం పగటిపూట కోతలు, రాత్రిపూట లో-వోల్టేజ్ కారణంగా వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయని ఆరోపించారు. అప్పులు చేసి సాగు చేస్తున్న రైతుల వరి, పత్తి, మొక్కజొన్న పంటలు నీరందక ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రైతులకు అవసరమైన నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కోతలను వెంటనే నిలిపివేసి రైతులను ఆదుకోవాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రెండు గంటలు కూడా కరెంట్ ఉండటం లేదు: రైతులు. ఉదయం 6 గంటలకు వ్యవసాయ మోటార్లు ఆన్ చేసినా సాయంత్రం వరకు రెండు గంటలు కూడా సక్రమంగా విద్యుత్ ఉండటం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రిపూట విద్యుత్ వచ్చినా లో-వోల్టేజ్ కారణంగా మోటార్లు పనిచేయడం లేదన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయిన సందర్భాల్లో వాటి మరమ్మతులు, మార్పిడి కోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సి వస్తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయ విద్యుత్ విషయంలో ఇలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదని, ప్రస్తుతం విద్యుత్ సమస్యలతో సాగు ప్రశ్నార్థకంగా మారిందని రైతులు ఆరోపించారు. ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి పుల్కల్ మండలంలో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ధర్నాలో బీఆర్ఎస్ నాయకులు జైపాల్ రెడ్డి, సుభాష్ రెడ్డి, పుల్కల్ మండల పార్టీ అధ్యక్షుడు విజయ్ కుమార్, గొంగ్లూర్ పల్లె సంజీవయ్య, సింగూర్ గ్రామ పార్టీ అధ్యక్షుడు చిట్టెపు వీరారెడ్డి, రాజాగౌడ్, తలారి విష్ణయ్య, కనకరెడ్డి, శ్రీనివాసాచారి తదితరులతో పాటు కోడూరు, మిన్‌పూర్, గొంగ్లూర్, పుల్కల్, ముదిమానిక్ తదితర గ్రామాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన వైద్యం అందించాలి







**పరీక్షల రిపోర్టుల కోసం ఎక్కువసేపు వేచి ఉండొద్దు**

**మందులు, వైద్య సామగ్రి ఎప్పటికప్పుడు**

**అందుబాటులో ఉంచాలి**

**ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో కలెక్టర్ చాహత్**

**బాజ్‌పాయి విస్తృత తనిఖీలు**

**హనుమకొండ, అక్టోబర్ 6 ( సందేశ సేతు ) :**

ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రికి వచ్చే గర్భిణులు, బాలింతలు, మహిళలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. వైద్య పరీక్షలు, రిపోర్టుల కోసం రోగులు ఎక్కువసేపు వేచి ఉండకుండా త్వరితగతిన సేవలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మంగళవారం హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి (గవర్నమెంట్ మెటర్నిటీ హాస్పిటల్)లో కలెక్టర్ విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను సందర్శించి గర్భిణులు, బాలింతలు, మహిళలకు అందుతున్న వైద్య సేవలతో పాటు అందుబాటులో ఉన్న వసతులను పరిశీలించారు. వైద్య సేవల కోసం ఆసుపత్రికి వచ్చిన గర్భిణులు, బాలింతలతో కలెక్టర్ స్వయంగా మాట్లాడారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, పరీక్షలు, ఇతర సౌకర్యాలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఓపీ నుంచి ఆపరేషన్ థియేటర్ వరకు తనిఖీ ఆసుపత్రిలోని ఓపీ సేవలు, ఆరోగ్య మహిళా క్లినిక్, ఫెర్టిలిటీ క్లినిక్, ల్యాబొరేటరీ, గైనకాలజీ ఓపీ, స్కానింగ్ గది, స్టోర్ రూమ్, లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్‌లను కలెక్టర్ పరిశీలించారు. ఓపీ రిజిస్టర్లు, ల్యాబ్ రికార్డులను తనిఖీ చేసి, ఓపీ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్‌లో నిర్వహిస్తున్న పరీక్షలు, గర్భిణులకు చేస్తున్న వివిధ రకాల పరీక్షలు, నమూనాల సేకరణ విధానం, పరీక్షల అనంతరం రిపోర్టులు అందించేందుకు పడుతున్న సమయం తదితర వివరాలను వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గైనకాలజీ ఓపీకి రోజువారీగా వచ్చే రోగుల సంఖ్య, వారికి సేవలు అందించేందుకు ఎంతమంది వైద్యులు అందుబాటులో ఉంటున్నారనే వివరాలను తెలుసుకున్నారు. స్కానింగ్ రూమ్‌లోని పరికరాల పనితీరుతో పాటు పరీక్షల రిపోర్టులు అందిస్తున్న విధానాన్ని పరిశీలించారు. పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్‌లలోని ఏర్పాట్లు, పరిశుభ్రత, వైద్య పరికరాల నిర్వహణను కలెక్టర్ పరిశీలించారు. స్టోర్ రూమ్‌లో మందుల నిల్వలు, వైద్య పరికరాలు, శస్త్రచికిత్స సామగ్రి, ఇతర వినియోగ వస్తువుల నిల్వలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యతో పాటు వారికి కేటాయించిన విధుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రిపోర్టుల కోసం జాప్యం చేయొద్దు ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ.. వైద్య సేవల కోసం వచ్చే గర్భిణులు, బాలింతలు ఎక్కువసేపు వేచి ఉండాల్సిన పరిస్థితి లేకుండా చూడాలన్నారు. ఆరోగ్య పరీక్షల రిపోర్టులను వీలైనంత త్వరగా అందించాలని, ల్యాబ్‌లో నిర్వహించే అన్ని పరీక్షల రిపోర్టులను జాప్యం లేకుండా ఇవ్వాలని సూచించారు. ప్రసూతి, ఇతర వైద్య సేవల విషయంలో రోగులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన మందులు, వైద్య సామగ్రి ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రిలోని వార్డులు, ఓపీ ప్రాంగణం, ల్యాబ్, లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్‌తో పాటు ఆసుపత్రి ఆవరణను నిరంతరం పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని వైద్యులు, సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, డ్యూటీ వైద్యులు ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న వసతుల వివరాలను కలెక్టర్‌కు వివరించారు.

# మహిళలను వేధించే ఆకతాయిలపై కఠిన చర్యలు










**సోషల్ మీడియాలో వ్యక్తిగత వివరాలపై అప్రమత్తంగా ఉండాలి**

**అత్యవసర ప్రయాణాల్లో 'టీ-సేఫ్' యాప్ ఉపయోగించాలి**

**సైబర్ నేరాలపై 1930కు ఫిర్యాదు చేయాలి**

**వరంగల్ క్రైమ్ ఏసీపీ సదయ్య**

**వరంగల్, అక్టోబర్ 6 ( సందేశ సేతు ) :**

మహిళలు, యువతులను వేధించే పోకిరీలు, ఆకతాయిలపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని వరంగల్ క్రైమ్ ఏసీపీ సదయ్య హెచ్చరించారు. మహిళలపై జరిగే నేరాలు, అఘాయిత్యాల నియంత్రణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, అప్రమత్తతతో వ్యవహరిస్తే అనేక నేరాలను ముందుగానే అడ్డుకోవచ్చని పేర్కొన్నారు. మంగళవారం వరంగల్ దేశాయిపేటలోని చంద్రకాంతయ్య ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో విద్యార్థులకు షీ టీమ్స్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ సదయ్య విద్యార్థులకు మహిళల భద్రత, సైబర్ నేరాలు, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

## సోషల్ మీడియాలో అప్రమత్తత అవసరం

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికల్లో వ్యక్తిగత ఫొటోలు, వివరాలను పంచుకునే సమయంలో యువతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులతో వ్యక్తిగత విషయాలను పంచుకోవద్దని, సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు. మహిళలు ఒంటరిగా, పరిచయం లేని ప్రాంతాలకు ప్రయాణించాల్సి వచ్చినప్పుడు భద్రత కోసం 'టీ-సేఫ్' యాప్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఉద్యోగాలు చేసే మహిళలు పనిచేసే ప్రదేశాల్లో ఎవరైనా అసభ్యంగా, అనుచితంగా ప్రవర్తిస్తే మౌనంగా ఉండకుండా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు.

## వేధింపులకు గురైతే ధైర్యంగా ఫిర్యాదు చేయండి

మహిళలు, యువతుల పట్ల ఎవరైనా అనుచితంగా లేదా అసభ్యకరంగా ప్రవర్తిస్తే భయపడకుండా వెంటనే షీ టీమ్ పోలీసులకు సమాచారం అందించాలని ఏసీపీ సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఫిర్యాదులపై విచారణ జరిపి, అవసరమైన సందర్భాల్లో కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు నేరానికి పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సైబర్ నేరాలకు గురైన వారు వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే పోలీస్ కమిషనర్ వాట్సాప్ నంబర్ 8712685257, షీ టీమ్ సీఐ వాట్సాప్ నంబర్ 8712685142, ఎస్సై వాట్సాప్ నంబర్ 8712685270 ద్వారా సమాచారం అందించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో షీ టీమ్ ఇన్‌స్పెక్టర్ సువర్ణ, ఎస్సై టీ. యాదగిరి, రామారావు, స్వాతి, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరా మహిళా డెయిరీ డిజైన్లు త్వరగా సిద్ధం చేయాలి





**నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలి**

**బీఎంసీయూల కొనుగోలును వెంటనే పూర్తి చేయాలి**

**అధికారులకు ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశం**

**కలెక్టర్ చాహత్ బాజ్‌పాయితో కలిసి సమీక్ష**

**హనుమకొండ, అక్టోబర్ 6 ( సందేశ సేతు ) :**

దామెర మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న పరకాల ఇందిరా మహిళా డెయిరీ ప్లాంట్ లేఅవుట్, భవన నిర్మాణ డిజైన్లను త్వరగా సిద్ధం చేసి తదుపరి ప్రక్రియను వేగవంతం చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయితో కలిసి వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. దామెరలో ఏర్పాటు చేస్తున్న పరకాల ఇందిరా మహిళా డెయిరీ ప్లాంట్ లేఅవుట్, డిజైన్లు, నిర్మాణ పనులకు సంబంధించిన అంశాలపై సమావేశంలో చర్చించారు.

## సివిల్ వర్క్స్‌పై సమీక్ష

డెయిరీ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి ఇప్పటివరకు జరిగిన పురోగతిని ఎమ్మెల్యే, కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా సివిల్ వర్క్స్, లేఅవుట్ ప్లాన్, భవన నిర్మాణ డిజైన్లు, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ల (బీఎంసీయూ) కొనుగోలు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. పాల డెయిరీ భవన నిర్మాణానికి సంబంధించిన డిజైన్లను వెంటనే పూర్తి చేయాలన్నారు. అవసరమైన లేఅవుట్లు, డిజైన్లను సిద్ధం చేసి నిర్మాణ పనులు ప్రారంభించేందుకు తదుపరి చర్యలను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.

## బీఎంసీయూల కొనుగోలులో జాప్యం వద్దు

సంగెం మండలంలో ఏర్పాటు చేయనున్న బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ల కొనుగోలు ప్రక్రియను కూడా త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. జిల్లా స్థాయి కమిటీ తుది నిర్ణయం తీసుకున్న సంస్థల నుంచి బీఎంసీయూల కొనుగోలుకు అవసరమైన ప్రక్రియను వెంటనే చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. మహిళా డెయిరీ ఏర్పాటుకు సంబంధించిన అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పనుల్లో జాప్యం లేకుండా చూడాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సూచించారు. సమావేశంలో డీఆర్డీవో మేన శ్రీను, పంచాయతీరాజ్ ఈఈ రాజగోపాల్ రావు, ఆరిజిన్ కన్సల్టెంట్ ప్రతినిధి వైవియన్ రెడ్డి, అదనపు డీఆర్డీవో వెంకటేశ్వర్లు, డీపీఎం సరిత, ఏపీఎం దివాకర్ రాయ్, పరకాల ఇందిరా మహిళా డెయిరీ మేనేజర్లు కృష్ణ, సృజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభకు ప్రశంస.. మైపాల్‌కు రాష్ట్రస్థాయి అవార్డు

**ఉత్తమ ఫిలిం మేకర్‌గా మునిపల్లి మండల వాసి**

**ఫోటోగ్రఫీపై బాల్యపు ఆసక్తే విజయానికి బాట**

**యువతకు ఉపాధి కల్పిస్తూ వీడియోగ్రఫీలో ప్రత్యేక గుర్తింపు**





**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 06 ( సందేశ సేతు )**

బాల్యంలో సరదాగా మొదలైన ఫోటోగ్రఫీపై ఆసక్తిని వృత్తిగా మలుచుకుని తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించిన మునిపల్లి మండలం బుసారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మైపాల్ రాష్ట్రస్థాయి ఉత్తమ ఫిలిం మేకర్ అవార్డును అందుకున్నారు. ఫోటో పరివార్ ఇండియా నిర్వాహకులు ఆయన ప్రతిభను గుర్తించి ఈ అవార్డుతో సత్కరించారు. చిన్నతనం నుంచే ఫోటోగ్రఫీపై మైపాల్‌కు ఆసక్తి ఏర్పడింది. తన సోదరులు తీసే వివిధ ఛాయాచిత్రాలను ఆసక్తిగా గమనిస్తూ ఫోటోగ్రఫీపై మక్కువ పెంచుకున్నారు. పల్లెటూరి వాతావరణంలో, మంజీరా నది తీరంలో సరదాగా ప్రారంభమైన ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ ప్రయాణం క్రమంగా ఆయనకు వృత్తిగా మారింది. ఉద్యోగం కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధి ఉన్నత విద్యను అభ్యసించిన మైపాల్ ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురుచూడకుండా తనకు ఇష్టమైన రంగాన్నే ఉపాధి మార్గంగా ఎంచుకున్నారు. వీడియోగ్రఫీలో నైపుణ్యం పెంచుకునేందుకు పలువురు గురువుల వద్ద శిక్షణ పొందారు. అనంతరం స్వయంగా వ్యాపారాన్ని ప్రారంభించి ఎదగడంతో పాటు కొంతమంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. ఆయన సోదరులు సదాశివపేటలో ఫోటోగ్రఫీ రంగంలో స్థిరపడగా, మైపాల్ హైదరాబాద్ కేంద్రంగా తన వృత్తిని కొనసాగిస్తున్నారు. ఫోక్ నుంచి సినిమాటిక్ షూట్స్ వరకు.. తెలంగాణ ఫోక్, వెడ్డింగ్ ఫోటోగ్రఫీ, సినిమాటిక్ ఫిలిం షూటింగ్ తదితర విభాగాల్లో తన ప్రతిభను చాటుతూ మైపాల్ పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు. సాంకేతికతలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకుంటూ ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీలో కొత్త ప్రయోగాలు చేస్తూ ముందుకు సాగుతున్నారు. జతన ప్రతిభను గుర్తించి రాష్ట్రస్థాయి ఉత్తమ ఫిలిం మేకర్ అవార్డుతో సత్కరించిన ఫోటో పరివార్ ఇండియా నిర్వాహకులకు మైపాల్ కృతజ్ఞతలు తెలిపారు. అవార్డు కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్ట్ ఫామ్ అధ్యక్షుడు పల్లె రవికుమార్, తెలంగాణ ఫోటోగ్రఫీ సంక్షేమ సంఘం కోశాధికారి మునగాల శైలేందర్, రాష్ట్ర ఫోక్ ఫోటోగ్రఫీ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, ఫోటో టెక్ అభిమన్యు రెడ్డి, ఎడిట్ పాయింట్ ఇప్పలపల్లి రమేష్ చారి, కరిపె రాజు తదితరులు పాల్గొన్నారు.

# సీఈసీ రాజీనామా కోరుతూ ఇండియా కూటమి ర్యాలీ

**తెలంగాణ చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన**

**కలెక్టరేట్ ఎదుట ధర్నా**

**పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కాంగ్రెస్ శ్రేణులు**






**కరీంనగర్, అక్టోబర్ 6 ( సందేశ సేతు ) :**

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి ఆధ్వర్యంలో కరీంనగర్‌లో సోమవారం భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. నగరంలోని తెలంగాణ చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు కూటమి నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా తరలివెళ్లారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు తమ డిమాండ్లకు మద్దతుగా నినాదాలు చేశారు. ర్యాలీ, ధర్నాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాంగ్రెస్ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు రాచర్ల పద్మతో పాటు పలువురు పార్టీ నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

**పీఎఫ్, ఈఎస్ఐ, హెల్త్ కార్డులు కల్పించాలి**

**180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలి**

**ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ డిమాండ్**

**వరంగల్, అక్టోబర్ 6 ( సందేశ సేతు ) :**



ప్రజలకు వైద్య, ఆరోగ్య సేవలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నిర్వహించిన ఆశా డే సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు ఆరోగ్య సేవలను చేరువ చేయడంలో ఆశా కార్యకర్తలు కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నప్పటికీ, వారి శ్రమకు తగిన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించడం లేదని పేర్కొన్నారు. ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు వర్తింపజేయాలని కోరారు. హెల్త్ కార్డులు మంజూరు చేయడంతో పాటు మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ.. ఆశా, ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని, వారు చేస్తున్న పనికి అనుగుణంగా వేతనాలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ఉద్యోగులకు సంవత్సరానికి రెండు జతల దుస్తులు అందించడంతో పాటు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే వారికి పెట్రోల్ అలవెన్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, మెరుగైన వేతనాలు, ఉద్యోగ భద్రత, సంక్షేమ సౌకర్యాలు కల్పించాలని నాయకులు కోరారు. ఈ సమావేశంలో ఎస్.ఆర్.ఆర్. తోట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అనిత, నర్సింగ్ ఆఫీసర్ మంజుల, ల్యాబ్ టెక్నీషియన్ మౌనికతో పాటు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# భూముల రీ-సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలి





**రోజుకు 70 ఎకరాల కొలత లక్ష్యంగా పనిచేయాలి**

**సర్వే బృందాలు ఉదయం 9 గంటల్లోపే**

**క్షేత్రస్థాయికి చేరుకోవాలి**

**జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి**

**హనుమకొండ, అక్టోబర్ 6 ( సందేశ సేతు ) :**

జిల్లాలో చేపట్టిన భూముల రీ-సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు క్షేత్రస్థాయిలో సర్వే పనులను మరింత ముమ్మరం చేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎల్కతుర్తి మండలం కోతుల నడుమ, హనుమకొండ మండలం పలివేల్పుల గ్రామాల్లో కొనసాగుతున్న భూ రీ-సర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే పనుల పురోగతి, ఇప్పటివరకు పూర్తయిన భూముల కొలతలు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న అంశాలపై సర్వేయర్లు, సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆయా గ్రామాల రైతులతో మాట్లాడి రీ-సర్వే జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ.. ప్రతిరోజూ 70 ఎకరాల భూముల కొలతలను పూర్తి చేయాలనే లక్ష్యంతో సర్వేయర్లు పనిచేయాలని సూచించారు. రీ-సర్వేలో రెండు రోవర్లను వినియోగించి పనులను వేగవంతం చేయాలన్నారు. సర్వే బృందాలు ఉదయం 9 గంటల్లోపే క్షేత్రస్థాయికి చేరుకుని, నిర్దేశించిన రోజువారీ లక్ష్యాన్ని పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని ఆదేశించారు. మరుసటి రోజు ఏ ప్రాంతంలో సర్వే చేపట్టనున్నారనే సమాచారాన్ని సంబంధిత రైతులకు ముందుగానే తెలియజేయాలని సూచించారు. రైతుల సహకారంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భూముల కొలతలు చేపట్టాలన్నారు. నిర్ణీత గడువులోగా రీ-సర్వే ప్రక్రియను పూర్తి చేసేందుకు అధికారులు, సర్వేయర్లు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, భూముల కొలతల శాఖ ఏడీ నూర్ సింగ్, హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఎల్కతుర్తి నాయబ్ తహసీల్దార్ రమేశ్, సర్వేయర్లు, ఆర్ఐలు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# వరద ముంపునకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం





**57వ డివిజన్‌లో రూ.2.52 కోట్లతో**

**రోడ్లు, సైడ్ డ్రైనేజీ పనులు**

**అంబేద్కర్ జంక్షన్ నుంచి వడ్డేపల్లి చర్చి**

**వరకు రూ.18 కోట్లతో రోడ్డు విస్తరణ**

**గోకుల్‌నగర్, వడ్డేపల్లి చౌరస్తాల**

**సుందరీకరణకు చర్యలు**

**ప్రజల సహకారంతో మరింత అభివృద్ధి సాధ్యం:**

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**హనుమకొండ, అక్టోబర్ 6 ( సందేశ సేతు ) :**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని గోకుల్‌నగర్, సమ్మయ్యనగర్‌తో పాటు పరిసర కాలనీల్లో ఏళ్లుగా నెలకొన్న వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. 57వ డివిజన్ పరిధిలో సుమారు రూ.2.52 కోట్ల నిధులతో చేపట్టనున్న అంతర్గత రోడ్లు, సైడ్ డ్రైనేజీ పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే ప్రారంభించి, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. వర్షాకాలంలో గోకుల్‌నగర్, సమ్మయ్యనగర్‌తో పాటు పరిసర కాలనీలు ముంపునకు గురవుతున్న నేపథ్యంలో సమగ్ర డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

## రెండు వైపుల నుంచి వచ్చే వరద నీటితో ముంపు

అంబేద్కర్ విగ్రహం వైపు నుంచి వచ్చే వర్షపు నీటితో పాటు సుబేదారి పోలీస్ స్టేషన్ వైపు నుంచి వచ్చే నీరు గోకుల్‌నగర్ చౌరస్తా వద్ద కలుస్తుండటంతో భారీ వర్షాలు కురిసిన సమయంలో పరిసర కాలనీలు ముంపునకు గురవుతున్నాయని ఎమ్మెల్యే వివరించారు. ఏళ్లుగా వర్షాలు వచ్చిన ప్రతిసారి ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితి పునరావృతం కాకుండా అవసరమైన రోడ్లు, సైడ్ డ్రైనేజీల నిర్మాణంతో శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

## రూ.18 కోట్లతో రోడ్డు విస్తరణ

అంబేద్కర్ జంక్షన్ నుంచి వడ్డేపల్లి చర్చి వరకు రోడ్డు విస్తరణకు సుమారు రూ.18 కోట్ల నిధులు మంజూరైనట్లు నాయిని రాజేందర్ రెడ్డి వెల్లడించారు. టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని, త్వరలో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రోడ్డు విస్తరణతో పాటు గోకుల్‌నగర్, వడ్డేపల్లి చౌరస్తాలను సుందరీకరించి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తామన్నారు. రోడ్డు విస్తరణ పూర్తయితే ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు పెరుగుతున్న జనాభా, వాహనాల రాకపోకలకు అనుగుణంగా మెరుగైన రహదారి అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.

## అభివృద్ధి పనులకు సహకరించాలి

రోడ్డు విస్తరణ, డ్రైనేజీ పనుల విషయంలో దుకాణదారులు, ఇళ్ల యజమానులు ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. పనులు జరుగుతున్న సమయంలో కొంత అసౌకర్యం ఎదురైనా భవిష్యత్ తరాలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ అందించేందుకు సమష్టిగా సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. వ్యక్తిగత సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి తాను సహకరిస్తానని చెప్పారు. అయితే ప్రజలందరికీ ఉపయోగపడే అభివృద్ధి పనులకు ఆటంకం కలిగించవద్దని కోరారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలు, ఇతర సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తూ పనులను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. రోడ్లు, డ్రైనేజీలు, రోడ్డు విస్తరణ, చౌరస్తాల సుందరీకరణ పనులను సమన్వయంతో పూర్తి చేసి 57వ డివిజన్‌ను మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పనులు పూర్తయితే గోకుల్‌నగర్, సమ్మయ్యనగర్ పరిసర ప్రాంతాల ప్రజలకు వరద ముంపు సమస్య నుంచి ఉపశమనం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి ఇ.వి. శ్రీనివాస్‌రావు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు అశోక్ రెడ్డి, అధికారులు, ఆయా కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

# శివనగర్‌పై ఇంత నిర్లక్ష్యమా ?







**రోడ్డుపై అలుకు నీళ్లు జల్లి బీజేపీ వినూత్న నిరసన**

**రూ.75 కోట్లు వెచ్చించినా నాలుగేళ్లుగా నత్తనడకన**

**డ్రైనేజీ పనులు: గంట రవికుమార్ ఆరోపణ**

**పనులు పూర్తి చేయకుంటే మున్సిపల్ కార్యాలయం,**

**ఎమ్మెల్యే ఇల్లు ముట్టడిస్తామని హెచ్చరిక**

**వరంగల్, అక్టోబర్ 6 ( సందేశ సేతు ) :**

శివనగర్ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల విషయంలో ప్రభుత్వాలు, అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ మండిపడ్డారు. ఏళ్ల తరబడి పనులు పూర్తి చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ మంగళవారం శివనగర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో వినూత్న నిరసన చేపట్టారు. శివనగర్ మండల అధ్యక్షుడు మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో డ్రైనేజీ పనులతో అధ్వానంగా మారిన రోడ్డుపై అలుకు నీళ్లు జల్లి బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ.. "ఎమ్మెల్యేలు, మంత్రులకు శివనగర్ ప్రజల గోస పట్టదా? శివనగర్ అంటే ఎందుకు ఇంత వివక్ష? మీకు ఓట్లు.. మాకు పాట్లా? మేము ముంపులోనే ఉండాలా?" అంటూ ప్రశ్నించారు. వర్షం వస్తే రోడ్లు, కాలనీలు నీటమునిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పాలకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గత ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్యే ఇద్దరూ శివనగర్ సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారని విమర్శించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం తామే పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రజల పక్షాన బీజేపీ ఉద్యమాన్ని మరింత ముమ్మరం చేస్తుందని స్పష్టం చేశారు. శివనగర్ డ్రైనేజీ పనుల ఆలస్యం స్థానికులకు శాపంగా మారిందని రవికుమార్ పేర్కొన్నారు. దాదాపు రూ.75 కోట్ల నిధులు వెచ్చిస్తున్నప్పటికీ నాలుగేళ్లుగా పనులు నత్తనడకన సాగుతున్నాయని ఆరోపించారు. పనుల జాప్యంతో రోడ్లు గుంతలమయమై ప్రమాదాలకు కారణమవుతున్నాయని, మురుగునీటితో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నాలుగు నెలల క్రితం మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి అధికారులతో కలిసి ఇదే ప్రాంతంలో సమీక్ష నిర్వహించి, పది రోజుల్లో పనులు పూర్తి చేసి రోడ్డును ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారని రవికుమార్ గుర్తుచేశారు. ఆ హామీ ఇప్పటికీ అమలు కాలేదని విమర్శించారు. డ్రైనేజీ పనుల జాప్యంపై సంబంధిత ప్రజాప్రతినిధులు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం హామీలకే పరిమితమయ్యాయని, శివనగర్‌లో క్షేత్రస్థాయిలో అభివృద్ధి కనిపించడం లేదని ఆరోపించారు. డ్రైనేజీ పనులను వెంటనే పూర్తి చేయకపోతే మున్సిపల్ కార్యాలయంతో పాటు స్థానిక ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. శివనగర్ మండల అధ్యక్షుడు మహమ్మద్ రఫీ మాట్లాడుతూ.. గుంతలమయమైన రోడ్లతో ప్రజలు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో మండల ప్రధాన కార్యదర్శులు వైట్ల గణేష్, సూర శ్రీనివాస్, జిల్లా నాయకులు ఆడెపు వెంకటేష్, బైరి శ్యాంసుందర్, మార్తా ఉషారాణి, తాళ్లపల్లి శ్రీనివాస్, బండి సుజాత, శెట్టి స్రవంతి, పిట్టల వెంకన్న, జన్ను ప్రభాకర్, నవీన్, దేవక్క, డివిజన్ కన్వీనర్లు సతీష్, బొడకుంట్ల శివశంకర్, తోట సాగరిక, శెట్టి రమేష్, సూరజ్, జిల్లా పదాధికారులు బన్న ప్రభాకర్, గడల కుమార్, బైరి నాగరాజు, అంకాల జనార్ధన్, వివిధ మోర్చాల నాయకులు మాదాసు రాజు, కూచన క్రాంతికుమార్, కర్నె రవీందర్, షేర్ల అనిల్, మోహనాచారి, వీరస్వామి, సాయి, చంద్రమోహన్, సతీష్ కట్టర్, కందుకూరి శ్రీనివాస్, జెట్లింగ్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పోలీసుల అవగాహన





**పిటికాయగుళ్ల గ్రామంలో అవగాహన కార్యక్రమం..**

**ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచన**

**ఎన్నికల నిబంధనలు పాటిస్తూ శాంతియుతంగా**

**ఎన్నికలు జరిగేలా సహకరించాలి: సీఐ మల్లికార్జున,**

**ఎస్ఐ రవీంద్రారెడ్డి**

**సందేశ సేతు బేస్తవారిపేట అక్టోబర్ 06-10-2026-:**

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జరిగేలా బేస్తవారిపేట పోలీసులు ప్రజల్లో అవగాహన కల్పించారు. బేస్తవారిపేట మండలం పిటికాయగుళ్ల గ్రామంలో సీఐ మల్లికార్జున, ఎస్ఐ రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించిన పోలీసు అధికారులు స్థానిక ప్రజలతో మాట్లాడి ఎన్నికల సమయంలో పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా సాగేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని సూచించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరూ పాల్పడవద్దని, ఎలాంటి వివాదాలకు, ఘర్షణలకు తావులేకుండా సంయమనంతో వ్యవహరించాలని పోలీసులు సూచించారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సమస్యాత్మక అంశాలు ఉంటే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు పోలీసు శాఖ అన్ని చర్యలు తీసుకుంటోందని అధికారులు తెలిపారు.

## బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధిగా ఇంద్రసేనారెడ్డి

**నియామక ఉత్తర్వులు జారీ చేసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు**

**కొలను సంతోష్‌రెడ్డి. అభినందనలు తెలిపిన బీజేపీ, బీజేవైఎం నాయకులు**

**హనుమకొండ, అక్టోబర్ 6 ( సందేశ సేతు ) :**



భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) హనుమకొండ జిల్లా అధికార ప్రతినిధిగా నరహరి ఇంద్రసేనారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, ప్రజల మధ్య ఉంటూ సంస్థాగత బలోపేతానికి ఇంద్రసేనారెడ్డి చేస్తున్న కృషిని గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆయన చేస్తున్న కృషిని పరిగణనలోకి తీసుకున్నట్లు పేర్కొన్నాయి. తనకు జిల్లా అధికార ప్రతినిధిగా బాధ్యతలు అప్పగించడంపై ఇంద్రసేనారెడ్డి పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తూ, యువతను సంఘటితం చేయడంతో పాటు బీజేవైఎంను సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఇంద్రసేనారెడ్డి నియామకంపై బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు.

## గ్రామీణ ప్రజలకు చేరువలో ప్రాథమిక వైద్యం

**రాష్ట్రవ్యాప్తంగా 265 గ్రామీణ ఆరోగ్య కేంద్రాల ప్రారంభం..**

**మార్కాపురం కలెక్టరేట్ నుంచి వర్చువల్‌గా ప్రారంభోత్సవంలో పాల్గొన్న**

**కలెక్టర్ విజయ సునీత.. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు కందుల**

**నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి..**



**సిద్ధం సేవ న్యూస్ మార్కాపురం జిల్లా అక్టోబర్ 06-10-2026-:**



మార్కాపురం జిల్లా,గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా 265 గ్రామీణ ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత తెలిపారు. గ్రామాల్లోనే ప్రజలకు నాణ్యమైన ప్రాథమిక వైద్యం, ఆరోగ్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంలో గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు కీలకంగా మారనున్నాయని ఆమె పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ఆరోగ్య కేంద్రాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించగా, మార్కాపురం జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత పాల్గొన్నారు. మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది కార్యక్రమానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలు చిన్నచిన్న అనారోగ్య సమస్యలకు కూడా దూర ప్రాంతాల్లోని ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే ప్రాథమిక వైద్య సేవలు పొందేలా గ్రామీణ ఆరోగ్య కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావడం ముఖ్య ఉద్దేశమన్నారు. సాధారణ అనారోగ్య సమస్యలకు వైద్య సేవలు, అవసరమైన పరీక్షలు, మందుల పంపిణీతో పాటు ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడంలో ఇవి ఉపయోగపడతాయని తెలిపారు.గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ముందస్తు పరీక్షలు, వ్యాధుల గుర్తింపు, చికిత్స, ఆరోగ్య అవగాహన వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు తమ ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా గ్రామీణ ఆరోగ్య కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రాథమిక వైద్యం ప్రజలకు ఎంత చేరువైతే అంతగా ఆరోగ్య సమస్యలను తొలిదశలోనే గుర్తించి చికిత్స అందించే అవకాశం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల అందుబాటును మరింత మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు కీలకమైన భాగమని తెలిపారు.వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది గ్రామీణ ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను నిరంతరం పర్యవేక్షించాలని, కేంద్రాలకు వచ్చే ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజలకు అవసరమైన వైద్య సేవలు సకాలంలో అందించడంతో పాటు ఆరోగ్య కార్యక్రమాలను సమర్థంగా అమలు చేయాలని ఆదేశించారు.గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులోనే ప్రాథమిక వైద్యం, ఆరోగ్య సేవలు అందేలా గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు భవిష్యత్తులో మరింత కీలక పాత్ర పోషిస్తాయని కలెక్టర్ ఎం. విజయ సునీత తెలిపారు.

# సుప్రీంకోర్టు కీలక తీర్పులు.. భూమి హక్కులపై స్పష్టత

**పహాణీ, జమాబందీ, ఖస్రా గిర్దావరి నమోదులతోనే**

**యాజమాన్య హక్కు రాదు. భూమిపై దీర్ఘకాలిక కబ్జా ఉన్నంత**

**మాత్రాన యాజమాన్యం లభించదు**

**అడ్వర్స్ పొజెషన్ వాదనకు చట్టపరమైన ప్రమాణాలు తప్పనిసరి**

**న్యూఢిల్లీ అక్టోబర్ 06-10-2026-:**



భూముల యాజమాన్య హక్కులు, రెవెన్యూ రికార్డులు, దీర్ఘకాలిక ఆక్రమణ అంశాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. 2026 సెప్టెంబర్ 10న భగ్ సింగ్ (డెడ్) వర్సెస్ బసంత్ కౌర్ (డెడ్) కేసులో సుప్రీంకోర్టు స్పష్టం చేసిన అంశాల ప్రకారం.. జమాబందీ, ఖస్రా గిర్దావరి వంటి రెవెన్యూ రికార్డులు ప్రధానంగా భూమిపై ఎవరి స్వాధీనం ఉందో నిర్ధారించేందుకు ఉపయోగపడతాయని, అవి స్వతంత్రంగా యాజమాన్య హక్కును సృష్టించవని పేర్కొంది. రెవెన్యూ రికార్డుల్లో పేరు ఉంటేనే ఓనర్ కాదు భూమి ఎవరిదనే ప్రశ్నకు కేవలం పహాణీ లేదా ఇతర రెవెన్యూ రికార్డుల్లో ఉన్న పేరు ఆధారంగా తుది నిర్ణయం తీసుకోలేమని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ రికార్డులు స్వాధీనం, భూమి వినియోగం వంటి అంశాలకు ఆధారాలుగా ఉండవచ్చని, అయితే వాటితోనే టైటిల్ ఏర్పడదని స్పష్టం చేసింది. యాజమాన్యాన్ని నిర్ధారించేందుకు అసలు హక్కు ఎలా ఏర్పడిందనే అంశాన్ని చూపించే సంబంధిత టైటిల్ పత్రాలు, రిజిస్ట్రేషన్ పత్రాలు తదితర ఆధారాలు పరిశీలించాల్సి ఉంటుందని తెలిపింది. 12 ఏళ్ల కబ్జా అంటే ఆటోమేటిక్‌గా భూమి సొంతం కాదు దీర్ఘకాలం భూమిని ఆక్రమించి ఉన్నంత మాత్రాన ఆ వ్యక్తికి ఆటోమేటిక్‌గా యాజమాన్య హక్కు వస్తుందనే భావన సరైంది కాదని కోర్టు తీర్పు స్పష్టం చేస్తోంది. వాదనకు చట్టపరమైన అవసరాలను నిరూపించాల్సి ఉంటుంది. కేవలం ఎక్కువ కాలం స్వాధీనంలో ఉండటం ఒక్కటే సరిపోదు. అందువల్ల “12 ఏళ్లు దాటితే భూమి కబ్జాదారుడిదే” అనే సాధారణ ప్రచారం చట్టాన్ని పూర్తిగా ప్రతిబింబించదని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వం కూడా చట్టపరమైన ప్రక్రియ పాటించాలి భూమి హక్కుల విషయంలో సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన విద్యాదేవి వర్సెస్ హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం తీర్పు కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. 2020 జనవరి 8న వెలువడిన ఈ తీర్పులో, చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించకుండా ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తి భూమిని స్వాధీనం చేసుకోవడం చెల్లదని కోర్టు పేర్కొంది. ఆ కేసులో రోడ్డు నిర్మాణం కోసం 1967--68లో భూమిని తీసుకున్నప్పటికీ సరైన భూసేకరణ ప్రక్రియ, పరిహారం లేకపోవడాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. ప్రభుత్వం తన దీర్ఘకాలిక స్వాధీనాన్ని ఆధారంగా చేసుకుని ద్వారా హక్కును పొందలేదని కోర్టు స్పష్టం చేసింది. బాధితురాలికి చట్టబద్ధమైన పరిహారం చెల్లించాలని ఆదేశించింది. భూ యజమానులు ఏం జాగ్రత్తలు తీసుకోవాలి? భూములకు సంబంధించిన రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు, లింక్ డాక్యుమెంట్లు, పాత రికార్డులు, పన్ను రసీదులు, ఇతర హక్కు పత్రాలను భద్రంగా ఉంచుకోవాలి. భూమిపై వివాదం ఏర్పడినప్పుడు స్వయంగా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా, సంబంధిత రెవెన్యూ అధికారులు, పోలీసు శాఖ లేదా న్యాయ నిపుణులను సంప్రదించి తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. అలాగే పహాణీ లేదా ఇతర రెవెన్యూ రికార్డుల్లో పేరు ఉందని మాత్రమే యాజమాన్యం ఖరారైందని భావించకుండా, అసలు టైటిల్ పత్రాలను పరిశీలించడం అత్యంత కీలకం. రైతులకు ముఖ్యమైన సందేశం సుప్రీంకోర్టు తాజా భగ్ సింగ్ కేసు తీర్పు రెవెన్యూ రికార్డులు, స్వాధీనం, యాజమాన్య హక్కుల మధ్య ఉన్న తేడాను మరోసారి స్పష్టం చేసింది. అదే సమయంలో విద్యాదేవి కేసు చట్టబద్ధమైన ప్రక్రియ లేకుండా ప్రైవేటు ఆస్తిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంపై కీలక మార్గదర్శకాలను ఇచ్చింది.అయితే “కబ్జా చేసిన ప్రతి వ్యక్తి జైలుకే వెళ్తాడు” లేదా “పేపర్ ఉన్న వ్యక్తే ప్రతి సందర్భంలో తుది యజమాని” అని ఈ తీర్పులను సాధారణీకరించడం సరైంది కాదు. ప్రతి భూ వివాదంలో సంబంధిత టైటిల్ పత్రాలు, స్వాధీనం, రికార్డులు, చట్టపరమైన పరిస్థితులను బట్టి నిర్ణయం ఉంటుంది.

# రెండు రోజుల పాటు నీటి సరఫరాకు అంతరాయం

**పైప్‌లైన్ లీకేజీతో బుధ, గురువారాల్లో సరఫరాపై ప్రభావం**

**ముందుగానే నీటిని నిల్వ చేసుకోవాలని జీడబ్ల్యూఎంసీ సూచన**

**వరంగల్, అక్టోబర్ 6 ( సందేశ సేతు ) :**



మడికొండ రైల్వే ట్రాక్ సమీపంలో పైప్‌లైన్ లీకేజీ మరమ్మతుల కారణంగా బుధ, గురువారాల్లో పలు ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు జీడబ్ల్యూఎంసీ సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజ్‌కుమార్ తెలిపారు. 60 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నుంచి సరఫరాపై ప్రభావం పడనుండటంతో పరకాల పరిధిలో స్తంభంపల్లి, వసంతాపూర్, బొల్లికుంట; వర్ధన్నపేట పరిధిలో మడికొండ, కడిపికొండ, బట్టుపల్లి, దేవన్నపేట సహా పలు ప్రాంతాలు; ఘన్‌పూర్ పరిధిలో రాంపూర్, ఉనికిచర్ల, టేకులగూడెం; వరంగల్ తూర్పులో శివనగర్, చింతల్, ఫోర్ట్ వరంగల్, శంభునిపేట, రంగశాయిపేట, కరీమాబాద్, మిల్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం కలగనుంది. మరమ్మతులు పూర్తయిన వెంటనే సరఫరాను పునరుద్ధరిస్తామని, అప్పటివరకు ప్రజలు అవసరమైన నీటిని ముందుగానే నిల్వ చేసుకోవాలని అధికారులు సూచించారు.

# ఉర్సు దసరా ఏర్పాట్లలో విభేదాల సెగ..!





**కుడా చైర్‌పర్సన్ గైర్హాజరుపై నగరంలో చర్చ**

**రంగలీల మైదానంలో ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే కొండా సురేఖ**

**కలెక్టర్, రెవెన్యూ అధికారులు హాజరు.. కనిపించని కుడా అధికారులు**

**కొండా సురేఖ--గుండు సుధారాణి మధ్య విభేదాల ప్రచారం నేపథ్యంలో ఆసక్తికర చర్చ**

**పండుగ ఏర్పాట్లలో రాజకీయాలకు తావివ్వొద్దంటున్న నగరవాసులు**

**అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని విజ్ఞప్తి**

**వరంగల్ ప్రతినిధి అక్టోబర్ 6 ( సందేశ సేతు ) :**

వరంగల్ నగరానికి ప్రత్యేక గుర్తింపుగా నిలిచే ఉర్సు దసరా ఉత్సవాల ఏర్పాట్ల వేళ ప్రజాప్రతినిధుల మధ్య విభేదాల అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఉత్సవాల నిర్వహణకు రంగలీల మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొండా సురేఖ మంగళవారం స్వయంగా పరిశీలించారు. ఉత్సవ సమితి ఆహ్వానం మేరకు చేపట్టిన ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్‌తో పాటు రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు. అయితే ఈ సందర్భంగా కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్‌పర్సన్ గుండు సుధారాణి, కుడా అధికారులు కనిపించకపోవడం స్థానికంగా చర్చకు దారితీసింది. నగర అభివృద్ధిలో కీలకమైన కుడాకు సంబంధించిన ప్రతినిధులు ఈ పరిశీలనలో ఎందుకు పాల్గొనలేదన్న అంశంపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## గైర్హాజరు వెనుక కారణమేంటి..?

ఎమ్మెల్యే కొండా సురేఖ, కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి మధ్య రాజకీయంగా విభేదాలు ఉన్నాయంటూ కొంతకాలంగా ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో తాజా పరిణామం ఆసక్తికరంగా మారింది. ఉత్సవ ఏర్పాట్ల పరిశీలనకు కుడా చైర్‌పర్సన్ హాజరుకాకపోవడం ఆ ప్రచారానికి మరింత ఊతమిచ్చిందన్న అభిప్రాయాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. అయితే కుడా చైర్‌పర్సన్, అధికారులు గైర్హాజరు కావడానికి రాజకీయ విభేదాలే కారణమా..? లేక అధికారిక కార్యక్రమాలు లేదా ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా..? అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది.

## ఉత్సవాల వేళ సమన్వయమే కీలకం

ప్రతి ఏటా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనే ఉర్సు దసరా ఉత్సవాల నిర్వహణలో వివిధ ప్రభుత్వ శాఖలు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం అత్యంత కీలకమని నగరవాసులు పేర్కొంటున్నారు. పారిశుధ్యం, రహదారులు, విద్యుత్, తాగునీరు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, భద్రత తదితర అంశాల్లో ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాల్సిన అవసరం ఉందంటున్నారు. ఉత్సవాల సమయంలో రంగలీల మైదానం పరిసర ప్రాంతాలకు భారీగా ప్రజలు తరలివచ్చే నేపథ్యంలో ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని కోరుతున్నారు.

## రాజకీయాలు పక్కనపెట్టి.. పండుగకు ప్రాధాన్యం

ప్రజాప్రతినిధుల మధ్య రాజకీయంగా ఎలాంటి భిన్నాభిప్రాయాలు ఉన్నా వాటిని పండుగ నిర్వహణపై ప్రభావం చూపనివ్వకూడదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. రాజకీయ అంశాలను పార్టీ వేదికలకే పరిమితం చేసి, వరంగల్ ప్రతిష్ఠకు సంబంధించిన ఉర్సు దసరా ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరుతున్నారు. వరంగల్ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఉర్సు దసరా ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయడంతో పాటు అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని నగరవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## బాక్స్ ఐటమ్ కుడా గైర్హాజరే హాట్ టాపిక్..!

ఉర్సు దసరా ఏర్పాట్ల పరిశీలనలో జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులు పాల్గొనగా కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి, కుడా అధికారులు కనిపించకపోవడమే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కొండా సురేఖ--గుండు సుధారాణి మధ్య విభేదాలు ఉన్నాయన్న ప్రచారం నేపథ్యంలో ఈ గైర్హాజరును రాజకీయ కోణంలోనూ చర్చిస్తున్నారు. అయితే గైర్హాజరుకు అసలు కారణం ఏమిటన్న దానిపై సంబంధిత వర్గాల నుంచి స్పష్టత రావాల్సి ఉంది.

# హెల్మెట్ ధరిస్తేనే రోడ్డు ప్రమాదాల నుంచి రక్షణ







**బేస్తవారిపేట ఫ్లైఓవర్ వద్ద పోలీసుల**

**ఆధ్వర్యంలో హెల్మెట్ అవగాహన కార్యక్రమం**

**ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్**

**ధరించాలి: సీఐ మల్లికార్జున, ఎస్ఐ రవీంద్రారెడ్డి**

**సందేశ సేతు బేస్తవారిపేట అక్టోబర్ 06-10-2026-:**

రోడ్డు ప్రమాదాల నివారణ, వాహనదారుల్లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే లక్ష్యంతో బేస్తవారిపేట పోలీసులు హెల్మెట్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బేస్తవారిపేట ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో సీఐ మల్లికార్జున, ఎస్ఐ రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను పోలీసులు వివరించారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల సమయంలో ప్రాణాపాయం జరిగే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలను పాటించాలని తెలిపారు. అతివేగం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం వంటి కారణాలతో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పోలీసులు వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనం నడిపే సమయంలో వేగాన్ని నియంత్రించుకోవడంతో పాటు, రహదారిపై అప్రమత్తంగా ప్రయాణించాలని సూచించారు. ‘హెల్మెట్ ధరించండి.. సురక్షితంగా ఇంటికి చేరండి’ అనే సందేశంతో ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ప్రమాదాల సంఖ్యను తగ్గించడంతో పాటు వాహనదారుల ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సీఐ మల్లికార్జున, ఎస్ఐ రవీంద్రారెడ్డి సూచించారు.

# ఫారం--6 మార్పులకు మేం ఆమోదం ఇవ్వలేదు




**ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు కీలక స్పష్టీకరణ..**

**ఏకపక్ష నిర్ణయాలపై పిటిషన్.. కేంద్రం, ఎన్నికల సంఘానికి నోటీసులు..**

**చట్ట విరుద్ధంగా తేలితే నిర్ణయాలను రద్దు చేసే అధికారం ఉందన్న ధర్మాసనం..**

**అక్టోబర్ 06-10-2026 సందేశ సేతు -:**

ఓటరు నమోదు కోసం వినియోగించే ఫారం--6లో చేసిన మార్పులపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది.సవరించిన ఫారం--6కు తాము ఎలాంటి ఆమోదం ఇవ్వలేదని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. ఫారం--6లో మార్పులు ఎవరు చేశారో రికార్డులు పరిశీలించిన అనంతరం తేలుస్తామని పేర్కొంది. ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ సహా సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేసింది.ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించి ఎన్నికల సంఘం నిర్ణయాలు ఏకపక్షంగా తీసుకున్నారనే ఆరోపణలపై దాఖలైన పిటిషన్లను సోమవారం సుప్రీంకోర్టు విచారించింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చీ, వి. మోహనతో కూడిన ధర్మాసనం ఈ వ్యవహారాన్ని పరిశీలించింది. 'మార్పులను మేం ఆమోదించలేదు' ఫారం--6లో చేసిన మార్పులకు సుప్రీంకోర్టు గతంలోనే అనుమతి ఇచ్చిందని ఎన్నికల సంఘం పేర్కొన్న అంశం విచారణ సందర్భంగా ప్రస్తావనకు వచ్చింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ స్పష్టతనిస్తూ, సవరించిన ఫారం--6ను తాము ఆమోదించలేదని తెలిపారు. సంబంధిత రికార్డులు కోర్టు ముందుకు వచ్చిన తరువాత ఫారంలో మార్పులు ఎవరు చేశారో పరిశీలిస్తామని పేర్కొన్నారు.ఫారం--6 అనేది ఓటర్ల జాబితాలో తొలిసారిగా పేరు నమోదు చేసుకునే అర్హులైన పౌరులు సమర్పించే చట్టబద్ధమైన దరఖాస్తు. ప్రత్యేక సవరణ ప్రక్రియలో దీనికి అదనపు వివరాలతో కూడిన ప్రకటనను జత చేయడంపై ప్రస్తుతం న్యాయపరమైన పరిశీలన కొనసాగుతోంది. ఏకపక్ష నిర్ణయాలపై అభ్యంతరాలు. ఎన్నికల సంఘంలోని ముగ్గురు సభ్యుల వ్యవస్థలో ప్రధాన ఎన్నికల కమిషనర్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారంటూ పిటిషన్‌లో ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో మరో ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలు సందర్భాల్లో అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ ఆరోపణలను ఎన్నికల సంఘం మాత్రం తప్పుదారి పట్టించే విధంగా ఉన్నాయని పేర్కొంది.ఫారం--6లో అదనపు ప్రకటనను చేర్చడం, దాని అమలు విధానం, ఎన్నికల సంఘంలో నిర్ణయాలు తీసుకున్న తీరుపై పిటిషన్‌లో పలు ప్రశ్నలు లేవనెత్తారు. చట్టపరమైన ప్రక్రియను అనుసరించకుండా చట్టబద్ధమైన నమూనా పత్రంలో మార్పులు చేశారా అనే అంశాన్ని కూడా కోర్టు పరిశీలించనుంది. చట్ట విరుద్ధంగా తేలితే నిర్ణయాలు రద్దు.. ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాలు చట్టానికి అనుగుణంగా ఉన్నాయా, లేక ఏకపక్షంగా తీసుకున్నవా అనే అంశం కూడా విచారణలో కీలకంగా మారింది. నిర్ణయాలు చట్టబద్ధ ప్రక్రియకు విరుద్ధంగా ఉన్నట్లు తేలితే వాటిని రద్దు చేసే అవకాశం ఉందని ధర్మాసనం స్పష్టం చేసినట్లు తాజా నివేదికలు వెల్లడించాయి.అయితే ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలన్న అభ్యర్థనపై సుప్రీంకోర్టు ఈ దశలో మధ్యంతర ఆదేశాలు జారీ చేయలేదు. ఎన్నికల వ్యవస్థ నిరంతరంగా పనిచేయాల్సిన నేపథ్యంలో, సంబంధిత అధికారుల నుంచి పూర్తి వివరాలు, రికార్డులు తీసుకున్న తర్వాతే తదుపరి నిర్ణయం తీసుకోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది. ఓటరు హక్కుపై చర్చ.. ఫారం--6లో అదనపు వివరాలు కోరడం వల్ల కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే వారికి ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందనే వాదనలు పిటిషన్‌లో వినిపించాయి. ముఖ్యంగా గత ఓటర్ల జాబితాల్లో తమ పేరు లేదా తల్లిదండ్రులు, తాతముత్తాతల పేర్లు లేకపోతే అదనపు వివరాలు సమర్పించాల్సి రావడం వల్ల అర్హులైన పౌరుల నమోదు ప్రక్రియపై ప్రభావం పడుతుందా అనే అంశం కూడా చర్చకు వచ్చింది.మరోవైపు, ఎన్నికల సంఘం మాత్రం సుప్రీంకోర్టు గత తీర్పులో ప్రత్యేక సవరణ ప్రక్రియకు సంబంధించి అదనపు ప్రకటనకు మద్దతు ఉందని తాము భావించామని, తమపై వచ్చిన ఆరోపణలు తప్పుదారి పట్టించే విధంగా ఉన్నాయని పేర్కొంది. దీంతో ఫారం--6 వ్యవహారం ఇప్పుడు న్యాయపరమైన పరిశీలనలో కీలక అంశంగా మారింది.సుప్రీంకోర్టు తదుపరి విచారణలో సమర్పించే రికార్డులు, ఎన్నికల సంఘం ఇచ్చే వివరణల ఆధారంగా ఫారం--6లో మార్పుల వెనుక ఉన్న ప్రక్రియపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అప్పటివరకు ఎవరు చట్టాన్ని ఉల్లంఘించారు అనే అంశంపై తుది నిర్ధారణకు రావడం సాధ్యం కాదని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు.

# విద్యా రంగంలో జిల్లాను జాతీయ స్థాయిలో నిలపాలి

**పీఆర్ఎస్--2027లో ఉత్తమ ఫలితాలు సాధించాలి**

**ఎఫ్ఆర్ఎస్ హాజరుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి**

**నెల రోజులుగా హాజరు నమోదు చేయని ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు**

**జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**



**హనుమకొండ, అక్టోబర్ 6 ( సందేశ సేతు ) :**

విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచి పరాక్ రాష్ట్రీయ సర్వేక్షన్ (పీఆర్ఎస్)-2027లో హనుమకొండ జిల్లాను జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలతో నిలపాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి విద్యాశాఖ అధికారులకు సూచించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్ ఎన్. రవి, డీఈవో ఎల్.వి. గిరిరాజ్ గౌడ్‌తో కలిసి విద్యాశాఖ కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని 108 ఎఫ్ఎల్ఎన్ కాంపిటెంట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (పీూూ-2024)లో సాధించిన ర్యాంకు కంటే మెరుగైన విద్యా ప్రమాణాలను సాధించేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల ఎఫ్ఆర్ఎస్ హాజరు, ఎఫ్ఎల్ఎన్, డ్రాప్‌బాక్స్ ఏర్పాటు, తనిఖీ బృందాల పనితీరు, ఖాన్ అకాడమీ, ఏఎక్సెల్ పాఠశాలల పురోగతి, అపార్ నమోదు తదితర అంశాలను సమీక్షించారు. ఎఫ్ఆర్ఎస్ హాజరు తప్పనిసరి ఉపాధ్యాయులు ప్రతిరోజూ ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) ద్వారా తప్పనిసరిగా హాజరు నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నెల రోజులకుపైగా ఎఫ్ఆర్ఎస్‌లో హాజరు నమోదు చేయని ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సూచించారు. విద్యార్థుల పేర్లు, ఇతర వివరాల్లో మార్పులు ఉంటే అపార్ ద్వారా నమోదు ప్రక్రియ చేపట్టాలన్నారు. 45 పాఠశాలల్లో టాయిలెట్ల నిర్మాణం సమగ్ర శిక్ష ద్వారా ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలోని 45 పాఠశాలల్లో టాయిలెట్ల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, మరమ్మతులు అవసరమైన చోట వెంటనే చేపట్టాలని ఆదేశించారు. ఖాన్ అకాడమీ కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ప్రధానోపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. ఉన్నత పాఠశాలలకు పంపిణీ చేసిన లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎల్ఐపీ) వర్క్‌బుక్స్‌ను సమర్థవంతంగా వినియోగించి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్, వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ రమేష్ రెడ్డి, ప్లానింగ్ కోఆర్డినేటర్ మహేష్, ఏఎంవో డాక్టర్ మన్మోహన్, జీసీడీవో సునీత, సీఎంఓ సుమాదేవి, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కనిగిరి చేరిన 100 బ్యాలెట్ బాక్సులు

**మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు సిద్ధం**

**నిబంధనల ప్రకారం భద్రపరిచిన అధికారులు.. ప్రశాంతంగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు**

**కనిగిరి అక్టోబర్ 06-10-2026 -:**



కనిగిరి మున్సిపాలిటీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన 100 బ్యాలెట్ బాక్సులు చేరుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటనలో ఈ వివరాలను వెల్లడించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు అందిన వెంటనే సంబంధిత నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారం వాటిని భద్రపరిచినట్లు కమిషనర్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో అవసరమైన సమయంలో నిబంధనల మేరకు వాటిని వినియోగించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కనిగిరి మున్సిపాలిటీ పరిధిలో ఎన్నికల ప్రక్రియను శాంతియుతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ఎటువంటి అవాంతరాలు లేకుండా నిర్వహించేందుకు అన్ని స్థాయిల్లో సమన్వయంతో అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ పర్వతనేని శ్రీధర్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి అధికారుల మధ్య సమన్వయం, అవసరమైన సామగ్రి సిద్ధం, భద్రతా చర్యలు తదితర అంశాలపై ముందస్తు ఏర్పాట్లు కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేలా మున్సిపల్ యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధమవుతోందని తెలిపారు.

# మద్దలకట్టలో అక్రమ మద్యం పట్టివేత

**52 మద్యం సీసాలు స్వాధీనం.. ఒకరి అరెస్టు..**

**సిద్ధం సేవ న్యూస్ పెద్దారవీడు అక్టోబర్ 06-10-2026-:**




మార్కాపురం జిల్లా,పెద్దారవీడు మండలం, మద్దలకట్ట గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 52 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ మద్యం విక్రయాలు, రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.మద్దలకట్ట గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పెద్దారవీడు ఎస్సై సైదుబాబు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద ఉన్న 52 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.అనంతరం నిందితుడిపై నిబంధనల మేరకు కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయాలు, తరలింపును అరికట్టేందుకు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని ఎస్సై సైదుబాబు వెల్లడించారు.అక్రమ మద్యం విక్రయాలు, రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ మద్యం విక్రయాలపై ప్రజలకు ఏమైనా సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. మద్యం అక్రమ రవాణా, విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక నిఘా కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# గిద్దలూరు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

**మార్కాపురం జిల్లా, గిద్దలూరు అక్టోబర్ 06-10-2026 -:**



మార్కాపురం జిల్లా కలెక్టర్ విజయ సునీతతో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి సమాలోచనలు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నీటి సరఫరాపై సమీక్ష.. తక్షణ, దీర్ఘకాలిక చర్యలకు ఆదేశాలు గిద్దలూరు నియోజకవర్గంలో నెలకొన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నట్లు గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు మార్కాపురం జిల్లా కలెక్టర్ విజయ సునీతతో ఎమ్మెల్యే సమాలోచనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కాపురం జిల్లా పరిధిలోని గిద్దలూరు నియోజకవర్గంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా పరిస్థితి, నీటి లభ్యత, బోర్లు ఎండిపోవడం, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. తక్షణ చర్యలకు ప్రాధాన్యం ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి అధికారులను కోరారు. నీటి కొరత ఉన్న ప్రాంతాలను గుర్తించి అవసరమైన చోట్ల ప్రత్యామ్నాయ నీటి వనరులు ఏర్పాటు చేయడం, బోర్ల మరమ్మతులు చేపట్టడం, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా వంటి చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. దీర్ఘకాలిక పరిష్కారంపై దృష్టి తాత్కాలిక చర్యలతో సమస్యను అధిగమించడంతో పాటు, గిద్దలూరు నియోజకవర్గంలోని తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేలా దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించాలని ఎమ్మెల్యే కోరారు.

# సినిమా

## రవితేజ సినిమాలో జేడీ చక్రవర్తి..

## కాకపోతే 26 ఏళ్ల తర్వాత మారిన సీన్



సినీ పరిశ్రమలో కాలం ఎవరిని ఎప్పుడు ఎక్కడ నిలబెడుతుందో చెప్పడం కష్టం. ఒకప్పుడు చిన్న పాత్రల్లో కనిపించిన నటులే తర్వాత స్టార్ హీరోలుగా ఎదుగుతుంటారు. అలాగే స్టార్ హీరోలుగా ఉన్నవారు కాలక్రమంలో విభిన్నమైన పాత్రలు చేస్తూ తమ కెరీర్‌ను కొనసాగిస్తుంటారు. ఇప్పుడు టాలీవుడ్‌లో వినిపిస్తున్న ఓ ఆసక్తికరమైన కాంబినేషన్ కూడా ఇదే విషయాన్ని గుర్తు చేస్తోంది. రవితేజ సినిమాలో జేడీ చక్రవర్తి.. కాకపోతే 26 ఏళ్ల తర్వాత మారిన సీన్ ! సినీ పరిశ్రమలో కాలం ఎవరిని ఎప్పుడు ఎక్కడ నిలబెడుతుందో చెప్పడం కష్టం. ఒకప్పుడు చిన్న పాత్రల్లో కనిపించిన నటులే తర్వాత స్టార్ హీరోలుగా ఎదుగుతుంటారు. అలాగే స్టార్ హీరోలుగా ఉన్నవారు కాలక్రమంలో విభిన్నమైన పాత్రలు చేస్తూ తమ కెరీర్‌ను కొనసాగిస్తుంటారు. ఇప్పుడు టాలీవుడ్‌లో వినిపిస్తున్న ఓ ఆసక్తికరమైన కాంబినేషన్ కూడా ఇదే విషయాన్ని గుర్తు చేస్తోంది. మాస్ మహారాజా రవితేజ హీరోగా, టాలెంటెడ్ డైరెక్టర్ వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమాలో సీనియర్ నటుడు జేడీ చక్రవర్తి కీలక పాత్రలో కనిపించనున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఒకవేళ ఈ వార్త నిజమైతే.. దాదాపు 26 ఏళ్ల తర్వాత రవితేజ, జేడీ చక్రవర్తి ఒకే సినిమాలో మరోసారి కలిసి కనిపించబోతున్నారు. అయితే ఈసారి మాత్రం అప్పటి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. రవితేజ ఇప్పుడు టాలీవుడ్‌లో మాస్ మహారాజాగా ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకోగా.. జేడీ చక్రవర్తి కీలక పాత్రలు, ప్రతినాయక పాత్రలతో ప్రేక్షకులను మెప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. 1999లో ఎస్వీ కృష్ణారెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన 'ప్రేమకు వేళాయెరా' సినిమా అప్పట్లో మంచి విజయాన్ని అందుకుంది. ఆ సమయంలో జేడీ చక్రవర్తి స్టార్ హీరోగా వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. అదే సినిమాలో రవితేజ మాత్రం చిన్న సహాయ పాత్రలో కనిపించారు. ఆ తర్వాత రవితేజ కెరీర్ క్రమంగా మరో మలుపు తిరిగింది. పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందిన 'ఇట్లు శ్రావణి సుబ్రమణ్యం' మొదట జేడీ చక్రవర్తి వద్దకు వెళ్లినప్పటికీ.. చివరకు రవితేజ హీరోగా ఆ సినిమా తెరకెక్కింది. ఈ చిత్రం రవితేజ కెరీర్‌కు కీలకమైన మలుపుగా నిలిచింది. 2007లో శ్రీను వైట్ల దర్శకత్వంలో వచ్చిన 'దుబాయ్ శీను'లో రవితేజ అప్పటికే పూర్తిస్థాయి స్టార్ హీరోగా ఎదిగారు. అదే సినిమాలో జేడీ చక్రవర్తి ఫ్లాష్‌బ్యాక్‌కు సంబంధించిన చిన్న పాత్రలో కనిపించారు. ఇలా ఇద్దరి కెరీర్ ప్రయాణాన్ని గమనిస్తే.. కాలంతో పాటు వారి స్థానాలు ఎలా మారాయో స్పష్టంగా కనిపిస్తుంది. ఇప్పుడు మరోసారి వీరిద్దరూ ఒకే సినిమాలో కనిపించనున్నారనే వార్త రావడంతో అభిమానుల్లో ఆసక్తి మొదలైంది. ముఖ్యంగా జేడీ చక్రవర్తి రవితేజకు ఎదురుగా ప్రతినాయకుడి పాత్రలో కనిపిస్తే.. ఈ కాంబినేషన్ మరింత ప్రత్యేకంగా మారే అవకాశం ఉంది. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ సినిమాకు 'తులాభారం' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. రవితేజ ఇంతకుముందు చేయని తరహాలో హారర్, కామెడీ, సస్పెన్స్ థ్రిల్లర్ అంశాలను కలిపి ఈ కథను రూపొందిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. వివేక్ ఆత్రేయకు ఉన్న ప్రత్యేకమైన హ్యూమర్‌తో పాటు మైండ్ గేమ్ తరహా కథనాన్ని రవితేజ ఎనర్జీకి జోడించి ఈ సినిమాను తెరకెక్కించనున్నట్లు సమాచారం. దీంతో ఈ ప్రాజెక్ట్‌పై మొదటి నుంచే అంచనాలు ఏర్పడుతున్నాయి. ఈ చిత్రంలో ప్రియాంక అరుళ్ మోహన్, అనస్వర రాజన్ కథానాయికలుగా నటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇద్దరి పాత్రలకు కథలో ప్రాధాన్యత ఉంటుందని సమాచారం. ఇప్పటికే వీరి కాంబినేషన్ కూడా సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కరీనా కపూర్ 'కింగ్'లో ఓ ప్రత్యేక పాటలో మెరవనున్నారు. ఈ పాటను భారీ స్థాయిలో చిత్రీకరించేందుకు చిత్రబృందం ప్రత్యేకంగా ప్రణాళికలు సిద్ధం చేస్తోందట. ఈ నెలాఖరులో దక్షిణాఫ్రికాలో ఈ స్పెషల్ సాంగ్ షూటింగ్ జరగనున్నట్లు సమాచారం. షారుక్ ఖాన్, కరీనా కపూర్ కాంబినేషన్‌కు ఇప్పటికే బాలీవుడ్ ప్రేక్షకుల్లో మంచి క్రేజ్ ఉంది. గతంలో వీరిద్దరూ కలిసి పలు చిత్రాల్లో నటించి అలరించారు. ఇప్పుడు 'కింగ్'లో వీరిద్దరూ మరోసారి తెరపై కనిపించబోతున్నారనే వార్త అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈ ప్రత్యేక పాటను సినిమాలోనే అతిపెద్ద ఆకర్షణల్లో ఒకటిగా నిలిచేలా భారీగా తెరకెక్కించాలని మేకర్స్ భావిస్తున్నట్లు సమాచారం. భారీ సెట్స్, గ్రాండ్ విజువల్స్‌తో పాటు స్టార్ పవర్‌ను కూడా ఉపయోగించుకుని ఈ పాటను రూపొందించనున్నట్లు తెలుస్తోంది. ఇక షారుక్ ఖాన్ పుట్టినరోజు సందర్భంగా 'కింగ్' టీమ్ మరో సర్‌ప్రైజ్ ఇవ్వడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. నవంబర్ 2న షారుక్ ఖాన్ జన్మదినం సందర్భంగా సినిమాకు సంబంధించిన కొత్త ప్రచార కంటెంట్‌ను విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే 'కింగ్'పై భారీ అంచనాలు ఉన్నాయి. షారుక్ ఖాన్ గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించనుండగా.. సుహానా ఖాన్ కీలక పాత్రలో నటిస్తోంది. ఇప్పుడు కరీనా కపూర్ ప్రత్యేక పాటలో కనిపించనున్నారనే వార్త సినిమాకు మరింత స్టార్‌డమ్‌ను తీసుకొస్తోంది. 'కింగ్'లో షారుక్, సుహానాతో పాటు బాలీవుడ్‌కు చెందిన పలువురు ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. దీపికా పదుకొణె, అభిషేక్ బచ్చన్, రాణి ముఖర్జీ, అనిల్ కపూర్, జాకీ ష్రాఫ్, జైదీప్ అహ్లావత్, అర్షద్ వార్సీ, రాఘవ్ జుయల్ తదితరులు ఈ సినిమాలో భాగమయ్యారు. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'కింగ్' డిసెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# స్పోర్ట్స్

## ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు

## హెడ్‌కోచ్‌గా సౌరవ్ గంగూలీ..!



రెండు వారాల పాటు వేలాది మంది ఆసియా క్రీడాకారుల హోరాహోరీ పోరాటాలకు వేదికగా నిలిచిన 20వ ఆసియా గేమ్స్‌కు తెరపడింది. నగోయాలోని మిజుహో పార్క్ అథ్లెటిక్ స్టేడియంలో ఆదివారం సాయంత్రం 90 నిమిషాల పాటు సాగిన ముగింపు వేడుకలు కనువిందు చేశాయి. ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా (ఓసీఏ) అధ్యక్షుడు షేక్ జోఆన్ బిన్ హమద్ అల్ థానీ క్రీడలు ముగిసినట్లు అధికారికంగా ప్రకటించారు. రెండు వారాల పాటు వేలాది మంది ఆసియా క్రీడాకారుల హోరాహోరీ పోరాటాలకు వేదికగా నిలిచిన 20వ ఆసియా గేమ్స్‌కు తెరపడింది. నగోయాలోని మిజుహో పార్క్ అథ్లెటిక్ స్టేడియంలో ఆదివారం సాయంత్రం 90 నిమిషాల పాటు సాగిన ముగింపు వేడుకలు కనువిందు చేశాయి. ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా (ఓసీఏ) అధ్యక్షుడు షేక్ జోఆన్ బిన్ హమద్ అల్ థానీ క్రీడలు ముగిసినట్లు అధికారికంగా ప్రకటించారు. అనంతరం ఓసీఏ పతాకాన్ని 2030 ఎడిషన్‌కు ఆతిథ్యం ఇచ్చే ఖతార్‌లోని దోహా నగర ప్రతినిధులకు అధికారికంగా అందజేశారు. ఖతార్ హైజంప్ దిగ్గజం ముతాజ్ బార్షిమ్ నుంచి ఈక్వెస్ట్రియన్ రైడర్ జాసిమ్ అల్ కువారీ ఆసియాడ్ పతాకాన్ని స్వీకరించాడు. ముగింపు వేడుకలకు ప్రధాన ఆకర్షణగా నిలిచిన అథ్లెట్ల పరేడ్‌లో భారత ట్రాప్ షూటర్ నీరూ ధండా త్రివర్ణ పతాకాన్ని చేతిలో పట్టుకుని ముందు నడిచింది. తెలుపు, నీలం రంగు దుస్తులు ధరించిన సుమారు 30 మంది భారత అథ్లెట్లు, అధికారులు ఈ మార్చ్‌పాస్ట్‌లో పాల్గొన్నారు. 'వన్ ఆసియా' అనే ఇతివృత్తంతో రూపొందించిన వేదికపై జపాన్ సాంప్రదాయ 'బౌన్-ఒడోరి' నృత్యాలు, 'మత్సుకెన్ సాంబా2' ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆరంభ లోపాలను దాటి ఈసారి ఆసియా క్రీడల నిర్వహణలో జపాన్ భిన్నమైన వ్యూహాన్ని అనుసరించింది. భారీ ఖర్చులతో ప్రత్యేకంగా అథ్లెట్స్ విలేజ్‌లు, కొత్త స్టేడియంలు నిర్మించకుండా.. అందుబాటులో ఉన్న వేదికలు, తాత్కాలిక నిర్మాణాలతో తక్కువ ఖర్చుతో క్రీడలను నిర్వహించింది. ఆరంభంలో హోటల్ వసతి సమస్యలు, రవాణా ఆలస్యం, అక్రిడిటేషన్ గందరగోళం ఎదురైనప్పటికీ.. నిర్వాహకులు త్వరగానే లోపాలను సరిదిద్ది పోటీలను విజయవంతంగా ముగించారు. 45 దేశాల నుంచి దాదాపు 11 వేల మంది అథ్లెట్లు పాల్గొన్న పోటీల్లో 54 ప్రపంచ రికార్డులు, 89 ఆసియా రికార్డులు బ్రేక్ అవడంతో ఈ ఆసియాడ్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. ఆసియాడ్‌లో భారత్‌కు మళ్లీ నాలుగో స్థానం ఆసియా ఖండాన్ని హోరెత్తించిన ప్రతిష్టాత్మక ఆసియా గేమ్స్ హంగామా ముగిసింది. భారత్ మరోసారి టాప్4లో నిలిచింది. 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్యాలతో మొత్తం 85 పతకాలు గెలిచింది. చివరి రెండు రోజుల్లో ఏకంగా 11 స్వర్ణాలు సాధించడంతో నాలుగో స్థానం ఖరారైంది. ఇంత వరకు బాగానే ఉంది కానీ గత ఆసియాడ్‌తో పోల్చితే ఈసారి మన దేశం వెనుకబడింది. ఈ మెరుపులు సరిపోతాయా.. ఆసియాడ్‌లో భారత్‌కు మళ్లీ నాలుగో స్థానం గత ఎడిషన్‌తో పోలిస్తే తగ్గిన 21 పతకాలు ఆసియా ఖండాన్ని హోరెత్తించిన ప్రతిష్టాత్మక ఆసియా గేమ్స్ హంగామా ముగిసింది. భారత్ మరోసారి టాప్4లో నిలిచింది. 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్యాలతో మొత్తం 85 పతకాలు గెలిచింది. చివరి రెండు రోజుల్లో ఏకంగా 11 స్వర్ణాలు సాధించడంతో నాలుగో స్థానం ఖరారైంది. ఇంత వరకు బాగానే ఉంది కానీ గత ఆసియాడ్‌తో పోల్చితే ఈసారి మన దేశం వెనుకబడింది. హాంగ్జౌలో 2023లో జరిగిన గత పోటీల్లో 28 స్వర్ణాలు సహా 106 పతకాలు సాధించిన భారత్.. ఈసారి 21 స్వర్ణాలకే పరిమితమైంది. మొత్తంగా 21 పతకాలు, 7 స్వర్ణాలు తగ్గాయి. అదే సమయంలో చైనా మరోసారి తన ఆధిపత్యాన్ని చాటింది. 169 గోల్డ్ సహా మొత్తం 341 మెడల్స్‌తో మళ్లీ 'టాప్' లేపింది ఆతిథ్య జపాన్ 83 స్వర్ణాలు, 269 పతకాలతో రెండో స్థానం సాధిస్తే.. దక్షిణ కొరియా 39 పసిడి సహా 150 పతకాలతో మూడో స్థానాన్ని దక్కించుకుంది. 28లో నిలబెట్టుకున్నది 8 స్వర్ణాలే హాంగ్జౌలో సాధించిన 28 స్వర్ణ పతకాల్లో భారత్ 8 స్వర్ణాలను మాత్రమే తిరిగి గెలిచింది. ముఖ్యంగా వ్యక్తిగత, పెయిర్ (జంట) ఈవెంట్లలో వచ్చిన 13 స్వర్ణాల్లో ఒక్కటి కూడా నిలబెట్టుకోలేకపోవడం ఆందోళన కలిగించే అంశం. అదే సమయంలో కొత్తగా 13 విభాగాల్లో భారత క్రీడాకారులు చాంపియన్లుగా అవతరించడం మాత్రం భవిష్యత్తుపై ఆశలు రేపుతోంది. అంటే భారత్ వద్ద కొత్త ప్రతిభ కొరవడలేదు. ఆ ప్రతిభను నిరంతర విజయాలుగా మార్చడం, ఒక తరం నుంచి మరో తరానికి విజయాలను కొనసాగించడం ఇప్పుడు అసలు సవాలుగా మారింది. టీమ్ ఈవెంట్ల తడాఖా ఈ ఆసియాడ్‌లో భారత్ నాలుగో స్థానం అందుకోవడంలో కీలక పాత్ర టీమ్ ఈవెంట్లలో మంచి ప్రదర్శనే. క్రికెట్, హాకీ, కబడ్డీ పురుషుల, మహిళల జట్లు డబుల్ ధమాకా మోగిస్తూ ఏకంగా ఆరు స్వర్ణాలను అందించాయి. షూటర్లు, అథ్లెట్లు, షట్లర్లు ఆసియాడ్‌లో ఎక్కువ పతకాలు అందించే షూటింగ్, అథ్లెటిక్స్ విభాగాల్లో ఈసారి ఆశించిన ఫలితాలు రాలేదు. గత ఎడిషన్లో 7 స్వర్ణాలు సహా 22 పతకాలు సాధించిన భారత షూటర్లు ఈ సారి 15 మెడల్స్ కే పరిమితమయ్యారు. ఇందులో గోల్డ్ మూడే. డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ మను భాకర్‌పై భారీ అంచనాలు ఉండగా ఆమె నిరాశపరిచింది. అయితే ట్రాప్ షూటర్ నీరూ దంఢా రెండు స్వర్ణాలు, రజతం గెలవడం, 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ విభాగంలో సురుచికమల్‌జీత్ తెచ్చిన స్వర్ణం ఊరటనిచ్చింది. ఇక, అథ్లెటిక్స్‌లో గాయం కారణంగా జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా దూరం కావడం భారత్‌కు భారీ లోటు. షాట్ తజీపుట్‌లో తజీందర్ హ్యాట్రిక్ స్వర్ణంపై కన్నేసినా రజతంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. జ్యోతి యర్రాజి వంటి కీలక అథ్లెట్లను కూడా గాయాలు దెబ్బతీశాయి. గత ఎడిషన్‌లో 6 గోల్డ్ మెడల్స్ వచ్చిన అథ్లెటిక్స్‌లో ఈసారి ఒకే ఒక్క స్వర్ణం మహిళల 4ఐ400 మీటర్ల రిలే టీమ్ అందించింది. ఇక, టెన్నిస్‌లో 4 దశాబ్దాల తర్వాత ఒక్క పతకం కూడా రాలేదు. బ్యాడ్మింటన్‌లో పురుషుల టీమ్ ఏకైక పతకం అది కూడా కాంస్యం మాత్రమే గెలిచి నిరాశ పరిచింది.

Printed by Published by **Racharla Gopi** on behalf of **Racharla Gopi**, printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS11-1/B/42, BPM GREEN LANDS COLONY, PRVATHAPUR, MEDIPALLY MANDAL AND DIVISION, GHMC, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500098** and published at H.No : 15-1-480/2F/209/A/1, dathatrreya colony, mulugu road, PO: K.m.college editor Racharla Gopi, **PRGI** - No, Gmail, Phone Number : **9908759929**